తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
19 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 310
పేజీలు 8
వెల రూ. 5.00




## అర్జున అవార్డులతో తెలంగాణకు గర్వకారణం

- గాయత్రి, ధనుష్‌కు సీఎం అభినందనలు
- జాతీయ క్రీడా పురస్కారాల విజేతలకు శుభాకాంక్షలు
- యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిన ప్రతిభ
- మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

హైదరాబాద్, ఆగస్టు 18 ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు గాయత్రి గోపీచంద్, ధనుష్ శ్రీకాంత్‌లకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. క్రీడారంగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి దేశ అత్యున్నత క్రీడా గౌరవాల్లో ఒకటైన అర్జున అవార్డుకు ఎంపిక కావడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. షట్లర్ గాయత్రి గోపీచంద్, షూటర్ ధనుష్ శ్రీకాంత్‌లు తమ కృషి, పట్టుదల, అంకితభావంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని ముఖ్యమంత్రి తెలిపారు. వారి విజయాలు తెలంగాణ యువతకు ప్రేరణగా నిలుస్తాయని, అంతర్జాతీయ స్థాయిలో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జాతీయ క్రీడా పురస్కారాలు--2025 అందుకున్న క్రీడాకారులు, కోచ్‌లు మరియు ఇతర విజేతలందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడారంగ అభివృద్ధికి వారు అందించిన సేవలు దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చాయని అన్నారు. క్రీడాకారులు సాధించిన విజయాల వెనుక ఎన్నో సంవత్సరాల కఠోర శ్రమ, క్రమశిక్షణ, అంకితభావం

➤ మిగతా 2వ పేజిలో..

### తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక

# " సర్వాయి పాపన్న గౌడ్




- ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- గీత, చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట
- గీత, చేనేత కార్మికులకు సాచ్యురేషన్ పించన్లు
- 50 వేల కాటమయ్య కిట్ల పంపిణీ..
- ప్రమాదవశాత్తు మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతి
- అధికారికంగా నిర్వహిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 18 :తెలంగాణ బహుజన సమాజ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు చాటిచెప్పేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో సీఎం ప్రసంగించారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి అన్యాయానికి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న గౌడ్ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహాయోధుడని కొనియాడారు.

**బహుజనుల గర్వకారణం పాపన్న**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే చెందిన నాయకుడు కాదని, సామాన్యులు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా

➤ మిగతా 2వ పేజిలో..

## నిషేధిత భూముల జాబితా రద్దు చేయాలి

- 22ఏ జాబితాపై హరీశ్‌రావు ఆగ్రహం
- రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్



మల్కాజ్‌గిరి, ఆగస్టు 18 : మల్కాజ్‌గిరిలో 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోందని విమర్శించారు. రాత్రికి రాత్రే కాలనీలను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2008లో అప్పటి ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేసిన తర్వాత ఆ భూములు పట్టా భూములుగా మారాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా ఎలాంటి వివాదాలు లేని భూములను ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రజారోగ్యంతో చెలగాటం ఆడొద్దు

- భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం
- వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచన
- కల్తీ నెయ్యిపై సజ్జనార్ హెచ్చరిక

➤ 2వ పేజిలో..






## భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి

- సామాజిక న్యాయంపై కవిత విమర్శలు
- భూ పంపిణీ మళ్లీ చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వ భూ విధానాలపై తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, ఆగస్టు 18తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే మరోసారి భూ పంపిణీ

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణను స్వచ్ఛ ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దుతాం



- పెట్టుబడిదారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం
- 2035 నాటికి 26 వేల మెగావాట్ల సౌర విద్యుత్ లక్ష్యం
- ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026 ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 18 తెలంగాణను స్వచ్ఛ ఇంధన తయారీ కేంద్రంగా, ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవోటెల్‌లో నిర్వహించిన రెండు రోజుల 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి హాజరైన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను ఉద్దేశించి మాట్లాడిన భట్టి, తెలంగాణ పెట్టుబడిదారులకు స్వర్గధామంలాంటి రాష్ట్రంగా ఎదుగుతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు

➤ మిగతా 2వ పేజిలో..

## నైపుణ్యమే జీవితానికి రాజయోగం

- ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ వేడుకలు ప్రారంభం
- యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టి
- కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం డీకే శివకుమార్



బెంగళూరు, ఆగస్టు 18 చేతిలో నైపుణ్యం ఉంటే జీవితంలో రాజయోగం ఉన్నట్టేనని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మరియు జీవనోపాధి శాఖతో పాటు కర్ణాటక నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విధానసౌధ విందు మందిరంలో నిర్వహించిన "ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ వేడుకలు--2026" కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడంలో నైపుణ్య శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నైపుణ్యవంతులైన యువత ప్రధాన శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో

➤ మిగతా 2వ పేజిలో..

# అర్జున అవార్డులతో తెలంగాణకు గర్వకారణం



ఉంటాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విజయాలు యువ క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి మరిన్ని ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు, ప్రోత్సాహకాలు అందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడా ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో గాయత్రి గోపీచంద్, ధనుష్ శ్రీకాంత్‌లు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించి తెలంగాణతో పాటు దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా రంగంలో కొత్త శిఖరాలను అధిరోహించి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన అభినందన సందేశంలో పేర్కొన్నారు.

# నిషేధిత భూముల జాబితా రద్దు చేయాలి

ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వేలాది భూములు, అలాగే హెచ్‌ఎండీఏ, హుడా పరిధిలోని స్థలాలు కూడా ఈ జాబితాలోకి చేరాయని ఆరోపించారు. ప్రజల ఆస్తి హక్కులను ప్రభుత్వం దెబ్బతీస్తోందని అన్నారు.నిషేధిత జాబితాలో భూములు ఉన్న విషయం ప్రజలకు ఆస్తి విక్రయానికి వెళ్లినప్పుడు మాత్రమే తెలుస్తోందని హరీశ్‌రావు చెప్పారు. తిలక్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి తన ఇంటిని విక్రయించేందుకు వెళ్లినప్పుడు నిషేధిత జాబితాలో ఉందని తెలిసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనను ఉదాహరణగా ప్రస్తావించారు. ఇలాంటి సమస్యలు ఒకరికి కాదు, లక్షలాది మంది స్థల యజమానులకు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు భూయజమానుల నుంచి భూమి లేదా అభివృద్ధి హక్కులు కోరుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తప్పు జరిగినట్లయితే దానికి రాజకీయ బాధ్యత వహించాల్సింది ప్రభుత్వమేనని, అధికారులపై నెపం మోపడం సరికాదన్నారు. జాబితాలో భూములను చేర్చిన వారు ఎవరో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

నిషేధిత భూముల వివాదంపై నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు సమయానికి అందాల్సిన సాయం ఆలస్యంగా అందుతోందని, దీనివల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు అధికారులను బాధ్యులుగా చూపడం సరైన విధానం కాదన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడం, కార్యాలయాల చుట్టూ తిప్పడం కాకుండా ప్రభుత్వం స్వయంగా తప్పులను సరిదిద్దాలని హరీశ్‌రావు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిషేధిత జాబితా నుంచి అర్హమైన భూములను తొలగించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# తెలంగాణను స్వచ్ఛ ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కావాలని పెట్టుబడిదారులకు ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఇంధన రంగంలో మార్పు అంటే కేవలం విద్యుత్ ఉత్పత్తి విధానంలో మార్పు కాదని, అది మొత్తం ఆర్థిక వ్యవస్థను మార్చే పరివర్తన ప్రక్రియ అని భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛ ఇంధన వినియోగదారుగా కాకుండా, స్వచ్ఛ ఇంధన సాంకేతికతల తయారీలో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా సమన్వయం చేసే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని భట్టి వెల్లడించారు. 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 26 వేల మెగావాట్లకు పైగా సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగం అభివృద్ధిలో విద్యుత్ నిల్వ వ్యవస్థలు కీలకమని పేర్కొంటూ, బ్యాటరీ నిల్వ కేంద్రాలు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ సామర్థ్యాన్ని సాధించాలని రాష్ట్రం ప్రణాళిక రూపొందించిందని వివరించారు. హైదరాబాద్ ఐటీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో సాధించిన ప్రగతిని విద్యుత్ రంగంలోనూ వినియోగించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్ విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతిపాదిత 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయనున్న కృత్రిమ మేధస్సు డేటా కేంద్రానికి ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం కలయికతో తెలంగాణ కొత్త అభివృద్ధి నమూనాను సృష్టించనుందని పేర్కొన్నారు.హరిత హైడ్రోజన్, విద్యుత్ వాహనాల రంగాల్లో కూడా తెలంగాణ ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించిందని భట్టి తెలిపారు. 2030 నాటికి ఏటా నాలుగు లక్షల టన్నుల హరిత హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని, 2035 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 12 వేల విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సౌర, పవన, బ్యాటరీ పరికరాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు మూలధన సబ్సిడీలు, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు టీజీ-ఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు అందిస్తామని ప్రకటించారు. ఈ ఇంధన పరివర్తన ప్రయాణం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే విజయవంతమవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. సమ్మిట్ అనంతరం వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను ఆయన సందర్శించి సాంకేతిక ఆవిష్కరణలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంతో చెలగాటం ఆడొద్దు

హైదరాబాద్, ఆగస్టు 18  ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే కల్తీ ఆహార వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని పోలీసు కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్) చేపట్టిన భారీ దాడులను ప్రస్తావిస్తూ ఆయన స్పందించారు. ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 130 సంస్థలను పరిశీలించగా, 39 తయారీ కేంద్రాలు, 91 విక్రయ కేంద్రాల్లో పెద్ద ఎత్తున కల్తీ నెయ్యి తయారీ జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. పామ్ ఆయిల్, వనస్పతి, స్టార్చ్, కృత్రిమ సువాసన పదార్థాలతో తయారు చేసిన నెయ్యిని స్వచ్ఛమైన నెయ్యిగా విక్రయిస్తున్నట్లు బయటపడింది. ప్రజలను మోసం చేస్తూ అధిక లాభాల కోసం ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని అధికారులు వెల్లడించారు.

దాడుల్లో సుమారు 36 టన్నుల కల్తీ నెయ్యి, ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో టన్నుల కొద్దీ కల్తీ నెయ్యితో పాటు క్రీమ్, పామ్ ఆయిల్, వనస్పతి, కృత్రిమ సువాసన పదార్థాలు ఉన్నాయి. సేకరించిన నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపించగా, తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఆహార భద్రత అధికారులకు అప్పగించారు. ఈ చర్యలు ఆహార భద్రత పరిరక్షణలో కీలక ముందడుగుగా నిలిచాయని అధికారులు పేర్కొన్నారు. కల్తీ నెయ్యి సరఫరా హోటళ్లు, టిఫిన్ కేంద్రాలు, మిఠాయి తయారీ సంస్థలు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలు, డెయిరీ దుకాణాలు, ఆయుర్వేద కేంద్రాల వరకు విస్తరించినట్లు దర్యాప్తులో తేలింది. కొందరు పూజలు, దీపారాధన కోసం వినియోగించే నెయ్యిగా కూడా ఈ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు బయటపడింది. తక్కువ ఖర్చుతో తయారు చేసి అధిక ధరలకు విక్రయించడం ద్వారా అక్రమ లాభాలు ఆర్జిస్తున్నారని అధికారులు తెలిపారు.

ఇలాంటి కల్తీ ఆహార పదార్థాల వినియోగం గుండె, కాలేయం, మూత్రపిండాలు, జీర్ణకోశానికి సంబంధించిన వ్యాధులకు కారణమయ్యే ప్రమాదం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. ప్రజలు నాణ్యమైన ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు, తయారీ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అనుమానాస్పద ఆహార ఉత్పత్తులపై వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఆహార కల్తీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని సజ్జనార్ పేర్కొన్నారు. కల్తీ వ్యాపారాలపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమాజ ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే వారిపై చట్టం తన పని తాను చేస్తుందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి

కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే "భూలక్ష్మి" పథకం ద్వారా భూమి లేని ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి పంపిణీ చేస్తామని ప్రకటించారు. భూమి అనేది పేదలకు ఆస్తి మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పేరుతో మాట్లాడుతున్నప్పటికీ ఆచరణలో సామాజిక అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించిన సామాజిక న్యాయ సంకల్ప సభ తర్వాతే ప్రభుత్వం ఈ అంశంపై మాట్లాడడం ప్రారంభించిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని విమర్శించారు.

భూ విధానాలపై కూడా కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశ్రమల పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూములు, భూదాన్ భూములు, పేదల భూముల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల భూముల వినియోగంపై పారదర్శకత లేదని, భూములకు సంబంధించిన విధానాలు పేదలకు నష్టం కలిగించేలా మారుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న భూమి వనరులను సమర్థంగా వినియోగిస్తే భూమిలేని కుటుంబాలకు భూమి పంపిణీ చేయడం సాధ్యమేనని కవిత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, ఇతర అందుబాటులో ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. భూమి పంపిణీ ద్వారా గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు సామాజిక సమానత్వం కూడా బలోపేతం అవుతుందని తెలిపారు.

బీసీలు, మైనార్టీలు, మహిళలు, ఆదివాసీలు, దళితులకు తగిన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఆస్తుల పంపిణీ ద్వారా కూడా సామాజిక న్యాయం సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూమి ఉన్న కుటుంబాలకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని, అదే అవకాశాన్ని పేదలకు కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే భూలక్ష్మి పథకాన్ని అమలు చేసి ప్రతి భూమిలేని పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి అందిస్తామని కవిత పునరుద్ఘాటించారు. సామాజిక న్యాయం కోసం ప్రజలు, మేధావులు, సామాజిక సంస్థలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పేదల భూముల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, భూమి పంపిణీ ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

# తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక " సర్వాయి పాపన్న గౌడ్

నిలిచిన యోధుడని సీఎం పేర్కొన్నారు. తన కాలంలో ఉన్న సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన పాపన్న సాహసం, స్వాభిమానం, ప్రజల కోసం నిలబడిన తత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.

ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం తెలంగాణకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఆయన చరిత్ర తెలిసేలా చేయడమేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. నెక్లెస్ రోడ్ పరిసరాల్లో స్వయంగా స్థలాన్ని పరిశీలించి విగ్రహం ఏర్పాటుకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. గణేష్ నిమజ్జనాలు, పర్యాటక సందర్శనల సమయంలో లక్షలాది మంది పాపన్న విగ్రహాన్ని చూసి ఆయన పోరాట స్ఫూర్తిని తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

### గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలోని గీత, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సాచ్యురేషన్ స్థాయిలో పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏ ఒక్క అర్హుడు కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గౌడ సోదరులకు ఇప్పటికే 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించే గీత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామని వెల్లడించారు. గీత వృత్తి తరతరాలకు కొనసాగేందుకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు.

### ఈత,తాటి చెట్ల పెంపకంపై దృష్టి

ఈత, తాటి చెట్ల సంఖ్య తగ్గిపోవడంతో గీత కార్మికుల వృత్తిపై ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల కాలువల గట్ల వెంట ఈత, తాటి మొక్కలను విస్తృతంగా నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సూచించినట్లు తెలిపారు. చెట్ల పెంపకం ద్వారా గీత కార్మికులకు భవిష్యత్తులో మరింత ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

### పండుగ సాయన్నకు ప్రభుత్వ గౌరవం

ముదిరాజ్ సమాజానికి చెందిన మహాయోధుడు పండుగ సాయన్న సేవలను కూడా ప్రభుత్వం గుర్తిస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. తెలంగాణ చరిత్రలో బహుజన నాయకులు, సామాజిక వర్గాల పాత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.

### సామాజిక న్యాయం కార్యరూపంలో...

సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా కార్యరూపంలో కనిపించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం అన్నారు. అందులో భాగంగానే బీసీ కులగణన నిర్వహించామని, ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేశామని గుర్తుచేశారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

### విద్యతోనే భావితరాల భవిష్యత్తు

కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రి వారిని తప్పనిసరిగా చదివించాలని సీఎం పిలుపునిచ్చారు. పేద కుటుంబాల పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నాణ్యమైన విద్య అవసరమన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం, పోషకాహారంతో కూడిన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఏటీసీల్లో చేరే యువతకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం అందిస్తున్నామని, విద్య కోసం అవసరమైన నిధులు సమకూర్చడంలో ప్రభుత్వం వెనుకాడబోదని హామీ ఇచ్చారు.

### పాపన్న ఆశయాలతో సమానత్వ తెలంగాణ

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన ధైర్యం, స్వాభిమానం, సమానత్వ భావనలను నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. బహుజన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే తెలంగాణ అభివృద్ధికి పునాది కావాలని అన్నారు. గీత, చేనేత కార్మికులు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థులు, రైతులు సహా ప్రతి వర్గం సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ట్యాంక్‌బండ్‌పై కొలువుదీరడం కేవలం ఒక విగ్రహ ఆవిష్కరణ కాదని.. తెలంగాణ బహుజన చరిత్ర, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తికి లభించిన ప్రజా గుర్తింపుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌడ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నైపుణ్యమే జీవితానికి రాజయోగం

యువత కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం అత్యవసరమని చెప్పారు. విద్యతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలు కూడా ఉంటే ఉద్యోగ అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని తెలిపారు.కర్ణాటక ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తూ యువతను ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించేందుకు పలు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరిగి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, అధికారులు కూడా యువత నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యంపై మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమలు, సేవా రంగం, సాంకేతిక రంగాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేసే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉపాధి కల్పనతో పాటు వ్యవస్థాపకతను ప్రోత్సహించడంపైనా దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాశ్ పాటిల్, రుద్రప్ప లమాని, కాంతా నాయక్, కర్ణాటక నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ హెచ్.ఎం. రేవన్న, హామీ పథకాల అమలు సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శాలిని రజనీష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యువతకు అందుబాటులో ఉన్న శిక్షణా అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## ఎస్సైనీ సన్మానించిన రెడ్లరేపాక నాయకులు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 18 తరంగాలు** వలిగొండ మండలం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ని పూలమాల శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో రెడ్లరేపాక గ్రామ సర్పంచ్ దేశ బోయిన బాలస్వామి యాదవ్,మాజీ సర్పంచ్ మాద లావణ్య శంకర్ గౌడ్,ఉప సర్పంచ్ కోమల కుమార్,మొహమ్మద్ జానీ కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు జువ్వగాని సుమన్ గౌడ్,పంతంగి రాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన తుర్కపల్లి సర్పంచ్



యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 18 తరంగాలు వలిగొండ మండల పరిధిలోని ఎం తుర్కపల్లి గ్రామ సర్పంచ్ మాసంపల్లి తిరుమలేష్, ఉప సర్పంచ్ సల్ల ఐలయ్య,వార్డ్ మెంబర్స్ బట్టు నవీన్,మాసంపల్లి కృష్ణ,తదితరులు నూతన ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## గుంతల మయమైన రోడ్డుకుమరమ్మతులు చేపట్టాలని భాజపా ఆధ్వర్యంలో ధర్నా



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 18 తరంగాలు**
భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో గుంతల మాయమైన రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట లోతైన గుంటలు ఏర్పడి,ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాలకి గురవుతున్నారని, అందుకు తక్షణమే స్థానిక ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి రోడ్డు మీద పడిన గుంటలను వెంటనే పూడ్చే పనులు చేపట్టాలని,లేనియెడల సంబంధిత శాఖ అధికారుల కార్యాలయాల వద్ద భారతీయ జనతా పార్టీ ముట్టడి చేపడుతుందని, అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా ముట్టడిస్తామని వారు ఎమ్మెల్యే, స్థానిక అధికారులను హెచ్చరించారు.తక్షణమే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంటలను పూడ్చని యెడల భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ తరపున పెద్ద కార్యక్రమాన్ని తీసుకొని అడుగడుగునా ఎమ్మెల్యే ని అడ్డుకుంటామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా, సీనియర్ నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ,రాస వెంకట్,బచ్చు శ్రీనివాస్,పాక పుల్లయ్య,బొడిగే ఆనంద్,కందుల తానేష,మంద నరసింహ,రావుల పద్మారెడ్డి,మండల పదాధికారులు మందుల నాగరాజు,రంజిత్ రెడ్డి, దయాకర్,వెంకటేష్, శ్రీనివాస్,మహేష్ మండల నాయకులు వెంకటేష్,ఎర్రవోలు జంగయ్య,అరుణ్, మచ్చగిరి,అశోక్, లింగస్వామి వివిధ గ్రామాల నాయకులు,బూత్ అధ్యక్షులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**•వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**




వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 18 తరంగాలు:వర్ధన్నపేట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.నియోజకవర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యారాణితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే నెంబర్ వన్ మున్సిపల్

## కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





**నల్గొండ – ఆగస్టు18, తరంగాలు:**
నల్గొండ పట్టణంలో సిసి రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు ఇలా అన్ని సదుపాయాలను కల్పించి సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు. మంత్రి 3 వ డివిజన్లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా, అద్దంకి రహదారి వరకు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పానగల్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి డీఈఓ కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వన్ టైం ఇంప్రూవ్మెంట్ కింద 14.45 కోట్ల రూపాయల తో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా డివిజన్ లలో మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, పట్టణానికి బయట 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డును చేపట్టడం జరిగిందని, పట్టణంలో 500 కోట్లతో చేపట్టిన సిసి రహదారులు, డ్రైన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, మారుమూల శివారు ప్రాంతాలను కలుపుకొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో రహదారుల ఏర్పాటుతోపాటు, సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ ,విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలని కల్పిస్తున్నామని, పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేలా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 83 కోట్ల రూపాయలతో వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయగా, నెల రోజుల్లో ఆ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించే పనులు శరవేగంగా నడుస్తున్నాయని, పట్టణానికి తాగినీటి కై ముఖ్యమంత్రిని ఒప్పించి మరో 300 కోట్ల రూపాయలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇదివరకే పట్టణంలో 125 కోట్ల రూపాయలతో 12 తాగునీటి ట్యాంకులు చేపట్టగా, అందులో ఒకటి పూర్తి అయిందని, డిసెంబర్ నాటికి తక్కిన 11 వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితాయని వెల్లడించారు.పట్టణంలో విద్యుత్ సమస్య లేకుండా ప్రధాన కాలనీలతో పాటు, శివారు గ్రామాలలో కూడా ఒక్కొక్కటి 3 కోట్ల రూపాయలు వెచ్చించి సబ్ స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, అవసరమున్న చోట స్మశాన వాటికలు, దేవాలయాలు,చర్చిలు మసీదులను కట్టిస్తున్నామని, పట్టణానికి మొదటి విడత 700 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, అవసరమైతే మరిన్ని ఇండ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ నెల 15న గొల్లగూడ సమీపంలో నిర్మించిన 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించామని, నల్గొండ ను సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. పట్టణంలో లతీఫ్ సాబ్ గుట్ట, శివాలయం గుట్టలకు 150 కోట్ల రూపాయలతో రహదారులను మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయని, అంతేకాక రోప్ వే కూడా ఏర్పాటు చేస్తున్నామని, పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన ఛాయా సోమేశ్వర దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు 150 కోట్ల రూపాయల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించామని, పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సమస్యలు తీరుస్తామని, పట్టణానికి నడిబొడ్డున ఉన్న నాగార్జున కళాశాల బ్లాక్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, తెలంగాణలోనే మొదటి కళాశాల గా పేరుపొందిన ఎన్జీ కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు, మహిళా స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి చేసేందుకు ఇటీవలే 3 కోట్ల రూపాయలతో పెట్రోల్ పంపును ప్రారంభించామని, 2 కోట్ల రూపాయలతో సూపర్ మార్కెట్ నిర్మిస్తున్నామని, అంతేకాక మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గోదాముల నిర్వహణ, రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి చేయిస్తున్నామని, సంఘంలో లేని మహిళలు కొత్త సంఘాలుగా ఏర్పాటు కావాలని ఆయన సూచించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన వల్ల పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలకతీతంగా నల్గొండ కార్పొరేషన్ ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని, పట్టణంలో రహదారుల ఏర్పాటుతో పాటు, డివైడర్లు ,సెంట్రల్ లైటింగ్, హైమాస్ లైటింగ్, సుందరీకరణ వల్ల పట్టణానికి మరింత శోభను తీసుకొస్తుందని అన్నారు.కార్పొరేటర్లు మల్లీశ్వరి, బొడ్డుపల్లి లక్ష్మి ,కవిత, వేణు, తదితరులు మాట్లాడారు. డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఆర్ డి ఓ అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం, డిటిడిఓ, ఏసీఎస్ డైరెక్టర్ నాగరత్నం, కార్పొరేటర్లు స్వాతి, కవిత, జాతీయ రహదారి అధికారులు, తదితరులు ఉన్నారు. జారీచేసిన వారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.

## కిరాణా వర్తకుల సంఘంతో పోలీసుల సమావేశం



**తొర్రూర్ తరంగాలు న్యూస్**
మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని కిరాణా వర్తకుల సంఘం సభ్యులతో తొర్రూరు సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం సరఫరా తగ్గుతున్న నేపథ్యంలో గుడుంబా తయారీదారులు ప్రస్తుతం చక్కెర వైపు దృష్టి సారించే అవకాశం ఉందని తెలిపారు.గుడుంబా తయారీదారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చక్కెర లేదా ఇతర ముడి పదార్థాలను విక్రయించి సహకరించవద్దని వర్తకులను హెచ్చరించారు. నిషేధిత గుడుంబా తయారీకి అవసరమైన పదార్థాలను విక్రయించినట్లు గుర్తిస్తే, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గుడుంబా నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని వర్తకులను కోరారు.



## పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే ఊరుకోం

- •పేద కుటుంబాలకు అండగా నిలిచిన పథకాలను ఆపొద్దు
- •కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలి
- •వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నిరసన
- •ఎమ్మార్వోకు మెమోరాండం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 18 (తరంగాలు)**: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే ఊరుకోమని,పేద కుటుంబాలకు అండగా నిలిచిన పథకాలను ఆపొద్దని,పథకాలను పునరుద్ధరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే రమేష్ ఆదేశాల మేరకు వర్ధన్నపేట మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం స్థానిక ఎమ్మార్వో విజయ్ సాగర్ కు మెమోరాండం అందజేశారు.ఈ సందర్భంగా మండల, పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ.. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రాష్ట్రంలోని ఎంతోమంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆరోపించారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించడంతో పాటు హామీ ఇచ్చిన తులం బంగారాన్ని కూడా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పథకాన్ని తిరిగి పూర్తిస్థాయిలో అమలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వ విధానాలను గ్రామగ్రామాన ఎండగడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, మున్సిపల్ కౌన్సిలర్లు గుజ్జ వీరన్న, భానోతు నవీన్, తిరుపతి సురేష్, సింగరబోయిన రాజశేఖర్, తుమ్మల శ్రీధర్, మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జ సంపత్ రెడ్డి, దుగ్యాల మాధవరావు, ఎండీ రహీం, వైస్ ఎంపీపీ నూనె బిక్షపతి, మాజీ సర్పంచ్ వేణు, పూజారి రఘు, రామన్న, గోర, సురేందర్, బొడ్డుపెల్లి శ్రీకాంత్, మధుసూదన్, బుచ్చిరెడ్డి, మహేందర్, మాలోతు వెంకన్న, చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు అటవీ డివిజన్‌లో 'ఆపరేటర్' హవా..

- ఆపరేటర్ కోసం అధికార దుర్వినియోగమా..?
- ఇల్లందు అటవీ డివిజన్‌లో నిధుల మళ్లింపుపై కలకలం!"
- బీట్ ఆఫీసర్ క్వార్టర్ ఔట్సోర్సింగ్ ఆపరేటర్‌కు కేటాయింపుపై అనుమానాలు..
- అధికారుల తీరుపై ఉద్యోగుల్లో చర్చ
- ఔట్సోర్సింగ్ సిబ్బందితో వ్యక్తిగత పనులు
- జిల్లా అధికారులు స్పందించి,బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



**ఇల్లందు ప్రతినిధి, ఆగస్టు 18 (తరంగాలు):** ఇల్లందు అటవీ డివిజన్ కార్యాలయంలో శాశ్వత ఉద్యోగుల కంటే ఔట్సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాది కాలంగా నిధుల నిర్వహణలో ఆపరేటర్ పాత్రపై శాఖలోనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.
బీట్ ఆఫీసర్ క్వార్టర్.. ఆపరేటర్ కోసమేనా?
కంప్యూటర్ ఆపరేటర్‌కు ప్రత్యేకంగా బీట్ ఆఫీసర్‌కు కేటాయించిన ప్రభుత్వ క్వార్టర్స్‌ను కేటాయించడం వెనుక ఉన్న కారణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ వసతి కేటాయింపుల నిబంధనలను పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

### డివిజన్ అధికారి--ఆపరేటర్ మధ్య 'లోపాయికారి' బంధమా?

డివిజన్ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ మధ్య ఉన్న సాన్నిహిత్యంపై కార్యాలయంలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. నిధుల నిర్వహణలో ఆపరేటర్‌కు అధిక ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని ఉద్యోగులు కోరుతున్నారు.

### నిధుల మళ్లింపుపై విచారణ జరపాలంటున్న ఉద్యోగులు

డివిజన్ కార్యాలయంలో నిధుల వినియోగం, ఖాతాల నిర్వహణ, బిల్లులు, వౌచర్లు తదితర రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



### ఔట్సోర్సింగ్ సిబ్బందితో వ్యక్తిగత పనులా?

బేస్ క్యాంప్ ( అటవీ సంరక్షణ సిబ్బంది )ఔట్సోర్సింగ్ సిబ్బందిని అధికారిక విధులతో పాటు వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై శాఖాపరమైన నిబంధనల ప్రకారం పరిశీలన జరపాలని కోరుతున్నారు.

### ఖాతాల మార్పులపై స్పష్టత ఇవ్వాలి

కొన్ని ఖాతాలను మార్చి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు కింది స్థాయి ఉద్యోగులలో చర్చకు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ రికార్డులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

### జిల్లా అధికారులు స్పందించాలి

ఇల్లందు అటవీ డివిజన్‌లో నిధుల వినియోగం, ప్రభుత్వ వసతి కేటాయింపులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది విధులు, ఖాతాల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 18 తరంగాలు**
వలిగొండ పట్టణ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను వివిధ సంఘాల నాయకులు మరియు గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రత్యేకంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల ప్రజలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి మరచిపోలేనిదని,కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని, సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో మొగల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు..ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, సంఘాల నాయకులు, స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి,గీత కార్మిక సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య, పబ్బు స్వామి గౌడ్, బత్తిని దేవేందర్ గౌడ్, మారగోని సత్యనారాయణ,రాగిర్ మధు,బత్తిని నరసింహ,బందరాపు లింగస్వామి,పబ్బు సురేందర్,పంజాల రమేష్,కొండూరు వెంకన్న, శ్రీరాములు,పాలకూర వెంకటేశం,మారగోని శ్రీనివాస్,బొడిగె సుదర్శన్, బత్తినిశేఖర్, బత్తిని శెట్టయ్య,కొండూరు సాయి,పబ్బు మల్లయ్య సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

# బస్వాపురం నిర్వాసితులకు ఊరట

- రూ.206 కోట్ల ఆర్‌అండ్‌ఆర్ నిధులు విడుదల
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



**యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 18 (తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపురం రిజర్వాయర్ పరిధిలోని నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూసేకరణ కోసం రూ.206 కోట్ల నిధులు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న నిర్వాసితులకు ఊరట లభించనుందని ఆయన పేర్కొన్నారు.బస్వాపురం రిజర్వాయర్ పూర్తయితే ఈ ప్రాంతంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భువనగిరి, వలిగొండ, నకిరేకల్, రామన్నపేట మండలాల్లోని రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.నిధుల విడుదలకు సహకరించిన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రత్తయ్య మృతి బీజేపీ పార్టీకి తీరని లోటు





- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ

వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 18,తరంగాలు :రత్తయ్య మృతి పార్టీకి తీరని లోటని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. నర్సంపేట నియోజకవర్గ రెడ్లవాడ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, క్షేత్రస్థాయిలో పార్టీకి పట్టున్న నాయకుడు రత్తయ్య మృతి విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆయన స్వగృహానికి వెళ్లి రత్తయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ రత్తయ్య పార్టీ బలోపేతానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్ , జిల్లా ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికల శ్రీధర్, రాజేందర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# రూపారెడ్డి హత్య కేసుపై మహిళా కమిషన్ సుమోటో విచారణ

- నిందితులను వెంటనే గుర్తించి,అరెస్టు చేసి నివేదిక సమర్పించాలని ఎస్పీకి ఆదేశం



**నల్గొండ, ఆగస్టు 18 (తరంగాలు):** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం జేబీ కాలనీలోని తన నివాసంలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ కుల్లు రూపారెడ్డి దారుణ హత్యకు గురైన ఘటనను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది.ఘటన జరిగి వారం రోజులు గడిచినా నిందితులను గుర్తించకపోవడంపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ఆందోళన, అసహనం వ్యక్తం చేశారు. మీడియా కథనాలు, ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించింది.నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు, కేసు దర్యాప్తుపై పూర్తి నివేదికను సమర్పించాలని నల్గొండ జిల్లా ఎస్పీని మహిళా కమిషన్ ఆదేశించింది.మహిళలపై జరిగే ఇలాంటి తీవ్రమైన హింసాత్మక ఘటనలను అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి, బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. కేసు దర్యాప్తు పురోగతిని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు.

# ఓదెలు అంతిమయాత్రలో వన్నాల వెంకటరమణ





**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 18,తరంగాలు** :ఓదెలు అంతిమయాత్రలో డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు. వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామ మాజీ సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకులు ఓదెలు మృతి చెందారు. ఆయన అంతిమయాత్రలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొని, పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఓదెలు సేవలను స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని తెలిపారు.అంతిమయాత్రలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ , జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం





- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు**

**వరంగల్ ప్రతినిధి,ఆగస్టు 18, తరంగాలు :** శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శనీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జెడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ. పుష్పలత, సహాయ అధికారి శంకరయ్యతో పాటు గౌడ కుల సంఘ నాయకులు చిర్ర రాజు గౌడ్, గట్టు రమేష్ గౌడ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, అనంత రమేష్ గౌడ్, పట్టపురపు యాకాంతం గౌడ్, లక్ష్మణ్, జనగాం శ్రీనివాస్ గౌడ్ తదితరులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. బహుజనుల కోసం పోరాడి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఒక చరిత్ర అని పేర్కొన్నారు. గౌడ కులంలో జన్మించిన పాపన్న గౌడ్ బహుజనుల కోసం పాలకులను ఎదిరించి, స్వరాజ్యాన్ని స్థాపించి ప్రజలకు సేవ చేశారని తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, సేవలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ కుల సంఘ నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన వసతులే లక్ష్యం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- కరీంనగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం
- సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన
- వాటర్ పైప్‌లైన్ పనులకు భూమిపూజ
- రూ. కోటి పైగా నిధులతో మౌలిక సదుపాయాల కల్పన



**కరీంనగర్, ఆగస్టు 18 (తరంగాలు ప్రతినిధి):** కరీంనగర్ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 20వ, 21వ డివిజన్ల పరిధిలోని విద్యానగర్‌లో శ్రీరాంనగర్ కాలనీలో రూ.1 కోటి మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే కాలనీవాసులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అదేవిధంగా 16వ డివిజన్‌లోని లక్ష్మీపూర్, మల్కాపూర్ కాలనీల్లో రూ.15 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న నూతన వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు. కరీంనగర్‌ను ఆధునిక సదుపాయాలతో కూడిన అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పట్టణాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో రహదారులు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయాల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని బండి సంజయ్ అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు.



# పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
- **అన్నీ వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాల అమలు**
- **జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్**

శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక సమానత్వం, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చేసిన కృషి, ఆశయాలు, పోరాటాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు .

ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి , అదనపు కలెక్టర్ రవి, హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ సామాజిక న్యాయ పోరాటాలలో, బహుజన రాజ్యాధికార సాధనలో స్వయం సమృద్ధ గ్రామీణ పరిపాలనలో సర్వాయి పాపన్న ప్రస్థానానికి అత్యున్నత చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు కుల, మత వివక్షలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ సమసమాజ స్థాపనకు బాటలు వేశారన్నారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య కుటుంబంలో పుట్టి అన్యాయాలకు వ్యతిరేకంగా ఎదురించారని అన్నారు. ఓరుగల్లు అంటేనే పోరాటాల గడ్డ అని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి గొప్పదన్నారు. నగరంలో మహనీయుల విగ్రహాలను పెట్టేందుకు తప్పకుండా తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అన్నీ వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు..అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు జిల్లా యంత్రంగం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఒంట్లో వేడి పెరిగి చాలా ఇబ్బందిగా ఉందా.. ఈ టిప్స్ మీ కోసమే..!

ఎండాకాలం వచ్చిందంటే చాలు ఎండలు మండిపోతాయి. ఈ ఎండలవల్ల నిత్యం శరీర ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. శరీరం డీహైడ్రేట్ అవుతుంది. దాంతో తరచూ ఒళ్లు అలసిపోయి నీరసం ఆవహిస్తుంది. ఏం చేయాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. శరీరం సహకరించదు. అలాంటి పరిస్థితి రావద్దంటే శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా కాపాడుకోవాలి. శరీర ఉష్ణోగ్రతలు పెరుగకుండా చూసుకోవాలి. అందుకోసం కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. మరి ఆ చిట్కాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

1. రోజూ రెండు కప్పుల తాటి బెల్లం కలిపిన నీళ్లను తాగడం ద్వారా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.
2. ప్రతి రోజూ క్రమం తప్పకుండా నిమ్మ రసం, కొబ్బరి నీళ్లు తాగడం ద్వారా కూడా శరీరంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చల్లబడుతుంది.
3. అదేవిధంగా రోజూ ఉదయం కొబ్బరి నూనె లేదా పొద్దు తిరుగుడు నూనెతో శరీరానికి మర్ధన చేసుకుని స్నానం చేయడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.
4. క్రమం తప్పకుండా ఎర్ర మందారం టీ తాగడంవల్ల కూడా శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.
5. కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగడం ద్వారా కూడా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.
6. అంతేగాక మెంతులను వేయించి, పొడిచేసి రోజూ గోరు వెచ్చటి నీటితో కలిపి తాగడం ద్వారా కూడా ఒంట్లో వేడిని తగ్గించుకోవచ్చు.
7. సోంపు, జీలకర్ర, ధనియాలు రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు తాగడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.
8. దానిమ్మ గింజల్లో కూడా శరీరంలోని వేడిని తగ్గించే లక్షణం ఉంది. రెండు మూడు రోజులకు ఒకసారైనా దానిమ్మ గింజలు తినడం లేదా దానిమ్మ రసం తాగడంవల్ల శరీరం చల్లగా ఉంటుంది.

# దేశంలో ఏటా పెరిగిపోతున్న కిడ్నీ వ్యాధులు..

- **30 ఏళ్ల నుంచే పరీక్షలు తప్పనిసరి అంటున్న నిపుణులు..**

మూత్రపిండాల ఆరోగ్యం సాధారణంగా తీవ్ర లక్షణాలు కనిపించే వరకు నిర్లక్ష్యానికి గురవుతుంటుంది. అయితే ప్రస్తుతం దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిభారత్‌లో ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. ఇతర వ్యాధులతో పోలిస్తే కిడ్నీ సమస్యలు చాలా కాలం వరకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా మెల్లగా అభివృద్ధి చెందుతాయి. లక్షణాలు బయటపడే సమయానికి కిడ్నీలకు గణనీయమైన నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అందుకే 30 ఏళ్ల వయస్సు నుంచే కిడ్నీ ఆరోగ్య పరీక్షలు ప్రారంభించడం అత్యంత కీలకమని వైద్యులు చెబుతున్నారు. భారత్‌లో కిడ్నీ వ్యాధుల భారం వేగంగా పెరుగుతోంది. తాజా పరిశోధనల ప్రకారం 2011-2017 మధ్య కాలంలో సుమారు 11 శాతం ఉన్న జఖణ ప్రబలత 2018-2023 మధ్య కాలంలో 16 శాతానికి పైగా పెరిగింది. ఇది పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో సూచిస్తోంది. ఈ పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయి. వేగవంతమైన పట్టణీకరణ, కూర్చునే జీవనశైలి, అసమతుల ఆహారం, పెరుగుతున్న స్థూలకాయం కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తున్నాయి. అదనంగా, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ కేసులు భారత్‌లో అధికంగా ఉండటం కూడా కిడ్నీ నష్టానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

# ఆవిష్కరణలకు అండగా ప్రభుత్వం యువతకు ఉద్యోగాలే లక్ష్యం





- మంత్రి వివేక్ వెంకటస్వామి
- మణుగూరు ఏటీసీ విద్యార్థుల ప్రతిభకు మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రశంసలు -- ఎలక్ట్రిక్ వాహనాలను కమర్షియల్ వాహనాలుగా అభివృద్ధికి సహకారం

**మణుగూరు టౌన్ తరంగాలు న్యూస్ ఆగస్టు 18**

మణుగూరు: మారుమూల ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల ప్రతిభను పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేసి, వారి ఆవిష్కరణలను ఉద్యోగావకాశాలుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు, భూగర్భ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మణుగూరు ప్రభుత్వ ఐటీఐ--అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర నూతన ఆవిష్కరణలను మంత్రి పరిశీలించి అభినందించారు. పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను పాత వాహనాల విడిభాగాల పునర్వినియోగంతో రూపొందించిన తీరును మంత్రి తెలుసుకున్నారు. వీటిని మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసి కమర్షియల్ వెహికల్స్‌గా తీర్చిదిద్దేందుకు సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తామని ప్రకటించారు. విద్యార్థుల ప్రాజెక్టులు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా మార్కెట్‌లో ఉపయోగపడే ఉత్పత్తులుగా మారేలా పరిశ్రమల సహకారం అందిస్తామని తెలిపారు.

### 119 ఏటీసీల మధ్య ఇన్నోవేషన్ పోటీలు

రాష్ట్రవ్యాప్తంగా టాటా సంస్థ సహకారంతో అభివృద్ధి చేస్తున్న 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు నిర్వహించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. మణుగూరు ఏటీసీలో శిక్షణ పొందుతున్న సుమారు 100 మంది విద్యార్థులకు టాటా సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

విదేశాల్లో ఉద్యోగాల కోసం టామ్‌కామ్ ద్వారా జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ ఇచ్చి జర్మనీ, జపాన్‌లలో అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యువత సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని సూచించారు.

ఏజెన్సీ యువతకు వ్యవసాయ సాంకేతిక కోర్సులు

మారుమూల గిరిజన ప్రాంతాల్లో యువత, యువ రైతుల కోసం ఆధునిక వ్యవసాయ సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. మణుగూరు ప్రాంతంలో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో సుమారు 100 మందికి శిక్షణ, ఉపాధి కల్పించే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

మణుగూరులో 412 మంది విద్యార్థులకు శిక్షణ

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణుగూరు ఏటీసీలో 244 మంది, ఐటీఐలో 168 మంది---మొత్తం 412 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఏజెన్సీ విద్యార్థుల కోసం ఐటీఐ--ఏటీసీ వద్ద రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఈ ప్రాంతంలోని సింగరేణి, బీటీపీఎస్, ఐటీసీ, నవభారత్, కేటీపీఎస్ వంటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తే భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

### పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ: కలెక్టర్

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మణుగూరు ప్రాంతం సుమారు 80 శాతం ఏజెన్సీ, షెడ్యూల్డ్ ఏరియా పరిధిలో ఉందని తెలిపారు. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జచీజ వంటి ఆధునిక కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. పరిశ్రమలతో సమన్వయం చేసి ప్రత్యేక జాబ్‌మేళాలు నిర్వహించి ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు మరిన్ని ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల ప్రతిభకు సరైన వేదిక, పరిశ్రమల అనుసంధానం, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# పాపన్న ఆశయాలను భావితరాలకు చేరవేయాలి

- కులవృత్తులను బతికించాల్సిన బాధ్యత మనదే -
- అదనపు కలెక్టర్ వేణుగోపాల్"
- సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను భావితరాలకు చేరవేయాలి - అధికారులు"
- 'ప్రభుత్వ ఫలాలు గ్రామ స్థాయి వరకు చేరాలి
- సర్దార్ జయంతి సభలో తీర్మానం"




**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 18**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 379వ జయంతి వేడుకలు మంగళవారం జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఘనంగా జరిగాయి. అదనపు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్దార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ త్యాగాలను, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన తరగతుల కులవృత్తులను ప్రోత్సహించి ఆర్థికంగా నిలబెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ ల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాల సమాచారం గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు లింగాల రాజయ్య గౌడ్, కె. రాజయ్య గౌడ్, బండి రాజుగౌడ్, శివరాజ్ గౌడ్, కమ్మగారి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా బీసీ అభివృద్ధి జిల్లా అధికారిణి విజయలక్ష్మి మరియు కార్యాలయ సిబ్బంది అపర్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలు



జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 18, (తరంగాలు): సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి ఉత్సవాలను మండలం లోని షాపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ ,గౌడ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమతా రాజు, తాళ్లపల్లి సురేష్, మాచర్ల రమేష్, తాళ్లపెల్లి వెంకన్న, తాళ్లపెల్లి ప్రేమనాథ్,పెద్దరి ప్రభాకర్, శివరాత్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువ్ జురెల్ స్టన్నింగ్ క్యాచ్‌పై దుమారం

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఎల్బీడబ్ల్యూ, క్యాచ్‌ల విషయంలో అంపైర్లపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంపైర్ల తీరు కారణంగానే తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసిందని మూడో రోజు ఆట అనంతరం భారత స్పిన్నర్ మానవ్ సుతార్ అనడం తీవ్ర వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటలో కేఎల్ రాహుల్ ఎల్బీడబ్ల్యూ విషయంలో అంపైర్ ఘోర తప్పిదం చేయడం.. డీఆర్ఎస్ ద్వారా అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆఖరి సెషన్‌లో భారత ఫీల్డర్ ధ్రువ్ జురెల్ అందుకున్న లో-క్యాచ్‌పై కూడా దుమారం రేగుతోంది. శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉదారా ఇచ్చిన లో- స్లిప్ క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అయితే క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లుగా రిప్లేలో కనిపించింది. కానీ ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై శ్రీలంక కోచ్‌లు, ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ సందర్భంగా మానవ్ సుతార్ వేసిన 22వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాహిరు ఉడారా డిఫెన్స్ చేయగా బంతి గల్లీ వైపు లో-క్యాచ్‌గా వచ్చింది. అక్కడే ఉన్న ధ్రువ్ జురెల్ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. రిప్లేలను పరిశీలించిన అంపైర్ బంతి కింద చేతివేళ్లు ఉన్నాయని ఔటిచ్చాడు. అయితే ఈ నిర్ణయంపై లాహిరు ఉడారా అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనంగా క్రీజును వీడాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశవ్ సువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు.

# పథకాల్లో జాప్యం చేస్తే సహించేది లేదు




- దిశా కమిటీ చైర్మన్ రఘురాం రెడ్డి ఆదేశాలు.. ఆసుపత్రులు, గురుకులాలు, తాగునీరు, రోడ్లపై ఫోకస్

**భద్రాద్రి కొత్తగూడెం, జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 18:**

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యాన్ని సహించేది లేదని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్ పనులు, నిధులు, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి.. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో కలిసి ఆయన సమీక్షించారు.

### ఆసుపత్రుల్లో పరికరాలు.. ఖాళీల భర్తీ

జిల్లాలోని ఆసుపత్రులకు అవసరమైన సీటీ స్కాన్, ఎంఆర్ఐ తదితర వైద్య పరికరాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని రఘురాం రెడ్డి సూచించారు. ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, సీఎస్ఆర్ నిధుల సమీకరణపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని అన్నారు.

### గురుకులాల్లో భోజనంపై కొరడా

గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందకపోవడంపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, వారానికి కనీసం ఐదు పాఠశాలలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

### 124 ఆవాసాలకు శాశ్వత తాగునీరు

గిరిజన ప్రాంతాల్లోని 124 ఐసోలేటెడ్ హ్యాబిటేషన్లకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్ సూచించారు. అటవీ అనుమతుల సమస్యలతో రహదారులు, విద్యుత్, తాగునీటి పనులు, రైతులు ఇబ్బందులు పడకుండా శాఖల మధ్య సమన్వయంతో పరిష్కారం చూపాలని కోరారు.

### అమృత్ పనులు వేగవంతం.. రోడ్లు వెంటనే బాగు చేయాలి

అమృత్ పథకం పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు. పైప్‌లైన్ పనుల అనంతరం దెబ్బతిన్న రహదారులను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. కొత్తగూడెం అమృత్ రైల్వే స్టేషన్ పనుల జాప్యాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

### పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి

పీఎంఏవై ఇళ్ల చెల్లింపులతో పాటు ఉపాధి హామీ పథకంలోని పెండింగ్ బకాయిలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ఉపాధి హామీ కింద రూ.17 కోట్ల వేతనాలు, రూ.50 కోట్ల మెటీరియల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు.

### ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు వైద్యం, తాగునీరు, రహదారులు, అటవీ అనుమతులు, సిబ్బంది కొరత వంటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ రఘురాం రెడ్డి సూచించారు. పనులు పెండింగ్‌లో పెట్టకుండా.. సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలి. కేంద్ర పథకాల ప్రయోజనాలు చివరి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలి అని ఆయన స్పష్టం చేశారు.

